క్లుప్తంగా

27 నుంచి మున్సిపల్ వర్కర్ల నిరవధిక సమ్మె



సమ్మె కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

రామచంద్రపురం: రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 27 నుంచి మున్సిపల్ వర్కర్లు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్టు ఏఐటీయూసీ నాయకులు పెద్దిరెడ్డి రాము, సీఐటీయూ నాయకులు ఎస్ బలరాం తెలిపారు. జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం ఉదయం 5.30కు మున్సిపల్ ఆఫీసు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలంటే కార్మికులందరూ ఐక్యతగా ఉండాలన్నారు. అనంతరం సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బండి సత్యనారాయణ, జి.రాజు ఏ.మాచర్లరావు, ముత్యాల సుజాత, వెంటపల్లి బాబురావు, కొమ్ము వీర్రాజు, పిల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

రేపు చెకుముకి సైన్స్ పరీక్ష

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న చెకుముకి మండల స్థాయి సైన్స్ పరీక్ష నిర్వహించనున్నట్టు జన విజ్ఞాన వేదిక మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింశెట్టి లెనిన్‌బాబు, వాసంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించే పరీక్షకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరుకావచ్చని చెప్పారు.

దాతల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



ఆర్థిక సహకారాన్ని విద్యార్థికి అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కాజులూరు: విద్యార్థులు దాతల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తూ, చదువులో ప్రతిభ కనబరుస్తున్న పలువురు పేద విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన దువ్వూరి శ్రీరామభాస్కర సత్యసాయి ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా కాజులూరు ప్రభుత్వ కళాశాల నుంచి ఎంపీసీలో 470కి 462 మార్కులు సాధించి, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన కేత వేణుకు ఆయన రూ.ఐదు వేల ఆర్థిక సహకారం పంపించగా, మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అందజేశారు. తన స్నేహితుడి ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సహకారానికి కృషిచేస్తున్న కళాశాల లైబ్రేరియన్ వి.భీమేశ్వరరావును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని కేశవరం, వెలగతోడు గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయుష్మాన్ భవ, ఇతర ప్రభుత్వ పథకాల మంజూరు కార్డులను సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి లబ్ధిదారులకు అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో ప్రగతికి మార్గం



మాచర సహకార సంఘంలో అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ ప్రతినిధులు

కపిలేశ్వరపురం: వ్యవసాయ సహకార సంఘ ప్రగతికి ఆర్థిక అక్షరాస్యత మార్గమవుతుందని మాచర పీఏసీఎస్ చైర్మన్ కరెడ్ల చంటిబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘ సభ్యులు ఆర్థికపరమైన పొదుపు, పెట్టుబడి, వడ్డీ తదితర అంశాలపై పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. అంగర డీసీసీబీ అధికారులు ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు.

చక్రాల కింద రోడ్లు ఛిద్రం

- దమ్ము చక్రాల ట్రాక్టర్లతో ధ్వంసమవుతున్న రహదారులు
- నిబంధనలు పాటించని వాహన యజమానులు, డ్రైవర్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గొల్లపాలెం-కుయ్యేరు రహదారిలో కాజులూరు వద్ద దమ్ముచక్రాలతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్



దమ్ముచక్రాల ట్రాక్టర్ ప్రయాణించడంతో ధ్వంసమైన ఆర్యావటం-మొగలిపాలెం రహదారి

కాజులూరు: గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట దమ్ముల సమయాల్లో టాక్టర్ల యజమానులు దమ్ము చక్రాలతో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూనే ఉన్నారు. రహదార్లను పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు కానీ, పోలీసులు కానీ వాటిపై చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గ్రామీణ రహదార్లలో దమ్ము చక్రాల ట్రాక్టర్లను నియంత్రించడంలో స్థానిక అధికారులు విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఖరీఫ్ మాసూళ్లు పూర్తికావటంతో రబీ పనులు ప్రారంభించిన రైతులు.. పొలాల్లో పంటదమ్ములు చురుగ్గా నిర్వహిస్తున్నారు. కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లోని గ్రామాల్లో సుమారు 600 ట్రాక్టర్లు ఉన్నాయి. దమ్ము చేసే సమయంలో ఈ ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి పొలాల్లో దమ్ము చేస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టరు డ్రైవర్లు, యజమానులు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు ఇనుప చక్రాలు బిగించి ఉన్న ట్రాక్టర్లతో విచ్చలవిడిగా రోడ్లపై సంచరిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగం అవుతోంది.

రోడ్లకు తీవ్ర నష్టం

ఇనుప చక్రాల ధాటికి రోడ్లు పగుళ్లు తీసి, రాళ్లు ఎగిరి పడుతుండడంతో రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. నియోజకవర్గంలో కాకినాడ-కోటిపల్లి, యానాం-ద్వారపూడి, కాజులూరు-రామచంద్రపురం, గొల్లపాలెం-యానాం రహదార్లతో పాటు పలు గ్రామీణ రోడ్లు దమ్ము చక్రాల తాకిడికి తీవ్రంగా పాడైపోతున్నాయి. దమ్ము చక్రాలతో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా, ట్రాక్టర్ యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీటిపై స్థానికులు ఫిర్యాదులు చేసినా, ట్రాక్టర్ యజమానుల్లో సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఎక్కువగా ఉండడంతో, వారిపై చర్యలు తీసుకునేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సాహసించ లేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దమ్ముచక్రాల ట్రాక్టర్ల బారి నుంచి గ్రామీణ రహదారులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు ప్రయాణించినట్టు మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

అధికారులు నిఘా ఉంచాలి



గ్రామాలలో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రహదార్లను నిర్మిస్తోంది. వాటిపై దమ్ము చక్రాల టాక్టర్లు ప్రయాణించటం వల్ల త్వరితగతిన శిథిలావస్థకు చేరుకుని, అధ్వానంగా తయారవుతున్నాయి. అధికారులు పంట దమ్ములు పూర్తయ్యే వరకూ రహదారులపై నిఘా ఉంచాలి.

– టేకుమూడి దుర్గారావు, చీకట్లవారిపేట

ఇనుప బెల్టులు పెట్టాలి



ట్రాక్టరు యజమానులు దమ్ము చేసేందుకు ఒక పొలం నుంచి మరో పొలం వెళ్లేందుకు టైరు చక్రాలు మార్చుకుని వెళ్లాలి. తప్పనిసరి పరిస్థితుల్లో దమ్ము చక్రాలకు ఇనుప బెల్టులను ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయంపై అధికారులు ట్రాక్టరు యజమానులకు అవగాహన కల్పించాలి.

– జొన్నకూటి వెంకటేశ్వరరావు, గొల్లపాలెం

గ్రామ స్వరాజ్యం తెచ్చిన సీఎం జగన్



వెలంపాలెంలో బ్రోచర్లు ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు



వెలగతోడులో సంక్షేమ వివరాలను వెల్లడిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలని గాంధీజీ చెప్పిన విషయాన్ని నిజం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చారని ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్, వెలంపాలెం గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత అన్నారు. వెలంపాలెంలో మంగళవారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయికి ప్రభుత్వ పాలనను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రికార్డు స్థాయిలో జరిగిందన్నారు. పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డికి, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో రూ.30 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అదేవిధంగా రూ.38,78 కోట్లు గ్రామంలోని ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, కన్వీనర్లు పలివెల రాజేష్, చల్లా శ్రీను, పెదపట్టపు నరేష్, వార్డు సభ్యులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో పేదల సంక్షేమం

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని మండపేట మండలం వెలగతోడులో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాదే పిడుగురాముడు, నాయకులు బళ్ల నాగేశ్వరరావు, షేక్ సుభాన్, మంకు శ్రీను, ముక్కపాటి కోటేశ్వరరావు, ముక్కపాటి రాజేశ్వరరావు, పాగిరి కిరణ్, గృహ సారథులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



మండల స్థాయి సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరమణ



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈవో రామలక్ష్మణమూర్తి

ఆకట్టుకున్న మండల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

రాయవరం: ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ఎంపీపీ నౌడు వెంకటరమణ ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయులు గుర్తెరిగి, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ మల్లిడి దొరారెడ్డి తదితరులు మాట్లాడారు. మండలంలోని 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయా విభాగాల్లో సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించినట్టు ఎంఈవో పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా సైన్స్‌ఫేర్‌కు పంపనున్నట్టు తెలిపారు. వ్యక్తిగత విభాగంలో రాయవరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి కె.నాగవెంకట తరుణ్, గ్రూపు విభాగంలో మాచవరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు పి.లోకేష్‌రెడ్డి, పి.వివేక్, టీచర్స్ విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ రాయవరం టీచర్ జి.సీతాదేవి విజేతలుగా నిలిచారు. ఎంఈవో రామలక్ష్మణమూర్తి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత మంతెన అచ్యుతరామరాజు, సైన్స్ ఉపాధ్యాయులు బీబీ రామారావు, ఎస్ఏ రహమాన్, జి.వీరాంజనేయరెడ్డి, బి.లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవ సంబరాలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ గణిత దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాలలోని మేథ్స్, కామర్స్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. డిజిటల్ స్క్రీన్ ద్వారా క్విజ్ అంశాలను నిర్వాహకులు పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ మేధస్సుకు ఎలాంటి పరిమితి లేదని, భవిష్యత్తు తరాల కోసం విద్యార్థులు, అధ్యాపకులు మేథోమథనం చేయాలన్నారు. పోటీల్లో పాల్గొన్న ఆల్ఫా, బీటా, గామా, తీటా గ్రూపులు ఉత్సాహంగా క్విజ్ పోటీలో పాల్గొన్నాయి. బీటా బృందం సభ్యులు అలేఖ్య, శిరీషా విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మేథ్స్ విభాగం అధిపతి ఎస్.కిరణ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, త్రినాథ్, గోపాలకృష్ణ, బాబూరావు, రామకృష్ణ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యానికి ప్రతీకగా వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, వాకతిప్ప, మాచర, టేకి, నల్లూరు, కాలేరు, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, తాతపూడి, వెదురుమూడిల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పలు అంశాలపై వైజ్ఞానిక ప్రదర్శనలిచ్చారు. తాము పాఠశాలలో నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా తయారు చేసి సందర్శకులకు వివరించారు. కాగా వ్యక్తిగత ప్రాజెక్టుల విభాగంలో నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్ట్ లైన్ ట్రాకింగ్ రోబోట్ ఎంపికైంది. గ్రూపు ప్రాజెక్ట్ విభాగంలో కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన సైకిల్ విత్ మోటార్, టీచర్ ప్రాజెక్ విభాగంలో కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఆటోమేటిక్ డ్రైనేజీ క్లీనర్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రాజెక్ట్ విభాగంలో అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఐప్యాడ్ డోర్ లాక్ సిస్టంలు ఎంపికయ్యాయి. ఆయా విద్యార్థుల బృందాలు త్వరలో నిర్వహించనున్న డివిజన్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని ఎంఈఓ కె.తాతారావు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదా చేస్తేనే భవిష్యత్తుకు వెలుగు

- విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు
- ఎల్‌ఈడీలు వినియోగిస్తే మేలంటున్న అధికారులు



విద్యుత్ సబ్ స్టేషన్

రాయవరం: విద్యుత్ లేనిదే ఏ పని జరగదన్నంతగా వినియోగిస్తున్నాం. రోజురోజుకూ విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. గృహావసరాలకే కాకుండా వ్యవసాయానికి, పరిశ్రమలకు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించాలని వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ ఏటా అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నెల 14 నుంచి 20 వరకూ అవగాహన వారోత్సవాలను రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిర్వహిస్తున్నారు.

నియంత్రణకు చర్యలు

రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ పేరిట జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యాయి. విద్యుత్ వృథా క్షమించరాని నేరం, విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు, సహజ వనరులను కాపాడుకుందాం.. భావి తరాలకు భరోసా కల్పిద్దాం.. తదితర నినాదాలతో పలు మార్గాల్లో ప్రదర్శనలిస్తూ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడం కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంగా చెప్పవచ్చు. ఇంధన పొదుపు, పేద, మధ్య తరగతి కుటుంబాలకు అత్యవసరం. సాధారణ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీల వినియోగంతో సుమారు 60 శాతం విద్యుత్ ఆదా చేయవచ్చని అధికారులు ప్రచారం చేస్తున్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

అవగాహనలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట మండలాల పరిధిలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేయనున్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో కేటగిరి-1 గృహ సంబంధ, కేటగిరి-2 వాణిజ్యం, కేటగిరి-3 పరిశ్రమలు, కేటగిరి-4 వీధిలైట్లు, మసీదులు, పంచాయతీ వాటర్ వర్క్స్, దేవాలయాలు, కేటగిరి-5 ఆక్వా, వ్యవసాయ కనెక్షన్లుగా పేర్కొంటారు.

పొదుపు మార్గాలివే..

ఏసీ, టీవీ ఉపయోగించిన తర్వాత బోర్డు వద్ద స్విచ్చాఫ్ చేయాలి. సెల్‌ఫోన్ చార్జింగ్ పూర్తయ్యాక వెంటనే స్విచ్ కట్టాలి. ఎలక్ట్రికల్ స్టౌ, కుక్కర్‌కు బదులు గ్యాస్ స్టౌ వినియోగించాలి. ఆటోమేటిక్ ఇస్త్రీ పెట్టె, మిక్సీ, వాషింగ్ మెషీన్ వినియోగాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ హీటర్లు, గీజర్ల స్థానే సోలార్ పరికరాలు ఉపయోగించాలి.

నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం

గతంతో పోలిస్తే ఇప్పుడు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. విద్యుత్ సరఫరాలో చాలా వరకు అంతరాయాలు తగ్గించాం. విద్యుత్‌ను పొదుపుగా వాడడం, ఆదా చేయడంపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే, పరోక్షంగా ఉత్పత్తి చేసినట్టే.

– వాసంశెట్టి ఈశ్వరరావు, జేఈఈ, సబ్‌స్టేషన్, రాయవరం

విద్యుత్ ఆదాపై అవగాహన

విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నాం. విద్యుత్ పొదుపు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ కరపత్రాలను కూడా పంపిణీ చేస్తున్నాం. వినియోగదారులు కూడా సహకరించాలి.

– చొల్లంగి శ్రీధర్‌బాబు, ఏడీఈ, ఈపీడీసీఎల్, మండపేట

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు



చెక్కును గ్రామ పెద్దలకు అందిస్తున్న చెల్లుబోయిన నరేన్

కె.గంగవరం: మండలంలోని భట్లపాలిక శివారు చల్లపూడి గ్రామంలో నూతన రాములమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణానికి మంజూరైన రూ.20 లక్షల చెక్కును మంగళవారం చల్లపూడి పెద్దలకు మంత్రి చెల్లుబోయిన వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి మొదటి విడతగా రూ.3.28 లక్షలు అందుతాయని, మిగిలినవి నిర్మాణ దశలను బట్టి అందుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు కట్టా తిరుమల, యలమంచిలి సత్యనారాయణ, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో తుప్పలను తొలగించాలి



వత్రపూడిలోని పంట కాలువలో ఏపుగా పెరిగిన మొక్కలు

కె.గంగవరం: సాగుకు సమాయత్తమవుతున్న రైతులకు సాగునీరు సక్రమంగా పారడానికి వీలుగా పంట కాలువలను శుభ్రం చేయాలని అద్దంపల్లి, వత్రపూడి గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుత పంట కాలువలకు ఇరువైపులా చెట్లు, మొక్కలు పెరిగి.. నీరు సక్రమంగా పారడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం సాగుకు నీరు వదిలినా, శివారు భూములకు ఇంకా నీరు చేరడం లేదంటున్నారు. తద్వారా పంట ఆలస్యమై, వర్షాల బారిన పడి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ శాఖ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం హామీ సరికాదు



మండపేటలో మాట్లాడుతున్న ధూళి జయరాజు

కపిలేశ్వరపురం (మండపేట): మహాశక్తి పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామంటూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడం సరికాదని పలువురు పార్టీల నాయకులు అన్నారు. మండపేట పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆటో యూనియన్ సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళి జయరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తదితర నాయకులు హాజరయ్యారు. కాగా ఉచిత ప్రయాణ హామీని వెనక్కు తీసుకోవాలని ధూళి జయరాజు డిమాండ్ చేశారు. మహిళల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యామ్నాయాలను అన్వేషించాలని, ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల వేలాది మంది ఆటో కార్మికుల ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



పడమర ఖండ్రికలో ఈవీఎం పనితీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించనున్న ఈవీఎంలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పడమర ఖండ్రిక, ఇతర గ్రామాల సచివాలయాల్లో ఈవీఎం యంత్రాలు పనిచేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యంత్రం పనిచేసే తీరు, ఓటరు ఓటు వేసే విధానాలపై సంబంధిత ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఓటింగ్‌లో పారదర్శకత కోసం ఈవీఎం యంత్రాలు దోహదపడతాయని చెప్పారు.

టెస్ట్ పేపర్స్ పుస్తకావిష్కరణ

కపిలేశ్వరపురం: పదో తరగతి విద్యార్థుల కోసం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రూపొందించిన స్టడీ మెటీరియల్ విద్యార్థుల్లో ప్రతిభ మెరుగుపడేందుకు దోహదపడుతుందని సంఘ నాయకులు అన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంఘం రూపొందించిన టెస్ట్‌పేపర్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ విజ్ఞప్తిపై తొమ్మిదేళ్లుగా టెస్ట్‌పేపర్స్ పుస్తకంలో సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు మెటీరియల్‌ను సమకూర్చడంలో కృషి చేస్తున్న రావులపాలేనికి చెందిన ఉపాధ్యాయుడు కేఎస్‌వీ కృష్ణారెడ్డిని నాయకులు అభినందించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: తొమ్మిదో తరగతి చదువుతున్న తన మనుమరాలు కనిపించడం లేదంటూ అన్నాయిపేటకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. మూడు రోజుల క్రితం ఉదయం పూట పాఠశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాలేదు.